## క్లుప్తంగా

### ఎస్సీ కమిషన్ మెంబర్ పదవి మాదిగలకు కేటాయించాలి

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ మెంబర్ పదవిని తిరిగి మంగళగిరి నియోజకవర్గంలోని ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు బుల్లా రాజారావు విజ్ఞప్తి చేశారు. నగరంలోని తెనాలి రోడ్డు బాబూ జగ్జీవన్‌రావ్ విగ్రహం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ఎస్సీ కమిషన్ సభ్యుడిగా పనిచేసిన బసవరావు తన పదవికి రాజీనామా చేయడం వల్ల ఆ పదవిని నియోజకవర్గానికి చెందిన మాదిగ వర్గానికి చెందిన వ్యక్తితో తిరిగి భర్తీ చేయాలన్నారు.

### మద్యం విక్రేత అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి సలాం హోటల్ సెంటర్‌లో నివాసముండే దాదాసాహెబ్ మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో అతని ఇంటిని తనిఖీ చేశామని, ఆ తనిఖీల్లో 29 క్వార్టర్ బాటిళ్లు లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో నివాసముంటున్న ఓ మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన సంఘటనపై తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం కాకుమాను మండల, రేటూరు గ్రామానికి చెందిన కగ్గా వెంకటలక్ష్మి (55) భర్త చనిపోవడంతో గత కొంతకాలం నుంచి ఉండవల్లి సెంటర్ వంశీ హైస్కూల్ ఎదురు సందులో ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటోంది. ఇక్కడ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 21వ తేదీన వెంకటపాలెం గ్రామానికి చెందిన మద్దూరు శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై పొలానికి వెళుతుండగా మార్గ మధ్యంలో ఉండవల్లి కొండవీటి వాగు సమీపంలో బండిమీద నుంచి జారి కిందపడడంతో వెంకట లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకట లక్ష్మి మృతి చెందింది. జరిగిన సంఘటనపై వెంకటలక్ష్మి కుమార్తె శివపార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

# గ్రామ స్వరాజ్యం సాకారం

- తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



113 త్యాళ్లూరులో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత



రేపూడిలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: సచివాలయాల ఏర్పాటుతో గ్రామస్వరాజ్యం సాకారమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

- వేములూరిపాడులో నాబార్డు నిధులు రూ.43లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ బహుళప్రయోజన గోదాం, రూ.21.80లక్షలతో హౌస్‌గణేష్‌పాడులో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, రూ.35లక్షలతో రేపూడిలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, 113త్యాళ్లూరులో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించి, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. రూ.21.80లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి ప్రజలకు దానిద్వారా పలు రకాల సేవలు, ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశారన్నారు. గాంధీజీ కలలుకన్న స్వరాజ్యంను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు అన్నిరకాల సేవలు అందించడంద్వారా సాకారం చేశారని చెప్పారు. ప్రజలకు పాలన సులువుగా అందాలంటే, సచివాలయ వ్యవస్థద్వారానే సాధ్యమవుతుందని భావించి నిరూపించారని తెలిపారు. రైతులకు వైఎస్సార్ రైతు భరోసాకేంద్రాల ద్వారా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, మందులు ఒకేచోట అందుతాయన్నారు. అంతేకాక రాష్ట్రంలో 1.30 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ హెల్త్ సెంటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు, నాణ్యమైన వైద్యం, మందులు అందేలా చేసి ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా నిలిచినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం యర్రగుంట్లపాడు గ్రామంలోని అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎ.సునీత, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, సయ్యద్ హబీబుల్లా, సుబాని, పాలపాటి రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, చిట్టా అంజనీదేవి, కె.చిన్నప్పరెడ్డి, కె.చిన్నా, ఆనంద్, ఎ.అనూరాధ, పాకనాటి కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బి,అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

తాడేపల్లిరూరల్ : విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో నిర్వహిస్తున్న సురభి వేడుకల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు ఆచార్యులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ కేఎల్‌యూ అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలతో పోటీపడుతోందని అన్నారు. విద్యార్థులకు స్నేహ పూర్వకమైన విద్యాబోధన చేయడంలో తమ అధ్యాపకులు విజయం సాధించారని అన్నారు. పరిశోధనలలో అంతర్జాతీయ స్థాయిలో తమ యూనివర్శిటీకి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ చేసిన సర్వేలో ప్రపంచంలోనే గుర్తింపు పొందిన శాస్త్రవేత్తలలో 9 మంది తమ క్యాంపస్‌లో ఉన్నారని వివరించారు. ప్రపంచంలోనే టాప్2 శాతం శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందిన కేఎల్‌యూ ఆచార్యులు డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ గంధర్వ ష్రైన్, డాక్టర్ బీటీపీ మాధవ్, డాక్టర్ ఎం.జానకిరామయ్య, డాక్టర్ ఎస్.షణ్ముగస్, డాక్టర్ సి.సంతోష్, డాక్టర్ కుమార్ నాయక్, డాక్టర్ అతుల్ మట్బాడ, లోకేంద్ర సింగ్‌లకు పురస్కారాలను అందజేశారు. వీరితో పాటు ఉత్తమ ఆచార్యులుగా ఎంపికైన 61 మందికి పురస్కారాలతో సత్కరించారు. సురభి వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అన్ని విభాగాల ప్రిన్సిపాల్స్, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం

మంగళగిరి: ఆధునిక ప్రపంచంలో జీవనశైలి మారడం, ఒత్తిడితో కూడిన జీవన విధానం వల్ల గతంలో కంటే గుండెపోట్లు పెరిగాయని, గుండెపోటు వచ్చినప్పుడు ఏం చేయాలో అవగాహన లేకపోవడం వల్ల గుండెపోటుకు గురైన వారిలో ఎక్కువ మంది చనిపోతున్నారని విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావు అన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం నగరంలోని రత్నాలచెరువు కీర్తి ట్యుటోరియల్ ప్రాంగణంలో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విజయ మోహనరావు మాట్లాడుతూ గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే ప్రాణ రక్షణ ప్రక్రియలో భాగంగా చేపట్టాల్సిన సీపీఆర్‌పై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సీపీఆర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## విద్యార్థులకు సామాజిక పరిజ్ఞానం అవసరం

- వీఐటీ ఏపీ వర్శిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి
- వీఐటీ ఏపీలో ప్రారంభమైన విటోపియా– 2024 క్రీడలు



సంప్రదాయ సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న ఏపీ విద్యార్థులు



నృత్యాలు ప్రదర్శిస్తున్న ఢిల్లీ విద్యార్థులు

తాడికొండ: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహను పెంచే కార్యక్రమాల ఏర్పాటు ఎంతో అవసరమని వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి అన్నారు. శనివారం విటోపియా 2024 వార్షిక క్రీడలతో పాటు సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు వసుధైకం పేరిట వివిధ రాష్ట్రాల సృంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయ ర్యాలీతో కార్యక్రమం ప్రారంభించగా అన్ని రాష్ట్రాల విద్యార్థులు తమ రాష్ట్ర సంప్రదాయ వేషధారణ నృత్యాలతో అలరించారు. అనంతరం సంగీత మరియు నృత్య విభాగాలలో మొదటి దశ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని, అవి విద్యార్థుల మానసికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. సాయంత్రం జరిగిన ప్రోషోలో గాయకులు మిధున్, దీపక్, నేహా గానం అందరినీ ఆకట్టుకోగా జమ్మర్ బ్యాండ్స్ తాయికుద్యం బ్రిడ్జ్ కేరళ బ్యాండ్, డిజే న్యూక్లియ బ్యాండ్‌ల సంగీత విభావరి ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వీఐటీ– ఏపీ వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, విటోపియా స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్ భాషా, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

మంగళగిరి: ఆర్‌టీఈ యాక్ట్ 12(1) ప్రకారం మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎస్.బాబు శనివారం తెలిపారు. అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 14 వరకు cse. ap. gov. in వెబ్ సైట్‌లో సంబంధిత పత్రాలను జతపర్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ చిన్నారులు, హెచ్ఐవీ ప్రభావితులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ తెగలుకు 4 శాతం, బలహీన వర్గాలు (బీసీ, మైనార్టీ, ఇతరులు) 6 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ సచివాలయం, నెట్ సెంటర్స్, ఎంఈఓ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు. తల్లిదండ్రులు గ్రామీణ ప్రాంతంలో సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షల లోపు కలిగి ఉండాలని తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14417ను సంప్రదించాలని ఎంఈఓ బాబు కోరారు.

## సవాళ్లు ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

- ఎఫ్‌ట్రానిక్స్ సీఈఓ దాసరి రామకృష్ణ
- చలపతి కళాశాలలో అంబరాన్నంటిన ఉద్ఘోష్ 2కె– 24 సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మోతడక(తాడికొండ): రాబోయే రోజుల్లో చాట్ జీపీటీ, కృత్రిమ మేధల వల్ల వచ్చే సవాళ్లను అధిగమించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు సన్నద్ధమై ఉండాలని ఎఫ్‌ట్రానిక్స్ సీఈఓ దాసరి రామకృష్ణ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్ఘోష్ 2కె – 24 పేరిట నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలలో ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనాశక్తి, ఆచరణ అమలు చేసే విధానంతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా తమను మార్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలకు 10 జిల్లాల నుంచి 60 ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 4500 మంది విద్యార్థులు పాల్గొని సాంకేతిక, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. కార్యదర్శి వై.సుజిత్ కుమార్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరమైన అంశాలు, అవసరాలకు అనుగుణంగా అకడమిక్‌లో పొందుపరుస్తూ అందుకు అనుగుణంగా కోర్సులలో మార్పులు చేర్పులు చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హీరో శివ కందుకూరి, హీరోయిన్ రాశీ సింగ్‌లు తమ డైలాగ్‌లు, నృత్యాలతో విద్యార్థులను అలరించారు. హ్యాపీడేస్ సినిమా ఫేమ్ టైసన్, రాహుల్ దయాకిరణ్‌ల ప్రదర్శనలు, విద్యార్థులతో కలిసి చేసిన డ్యాన్స్‌లతో కళాశాల హోరెత్తింది. అనంతరం జబర్దస్త్ టీమ్ పొట్టి నరేష్, ఫైమా, బాబు, నూకరాజు పంచ్ డైలాగులతో స్కిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైవీ ఆంజనేయులు సతీమణి వైవీ అనంతకుమారి, వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.జయకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఉద్ఘోష్ కన్వీనర్ సాయి శ్రీనివాస్, నాగ రవి కిరణ్, కల్చరల్, క్రీడా కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.తులసీ రాణి, పాల్గొన్నారు.